



# వలయం

కుప్పాల వెంకట సుబ్బారావు

“శ్రీసీతమ్మగారూ . సీతమ్మగారూ...” అన్న పోస్ట్‌మాన్ కేకకి ఆత్రంగా బయట కొచ్చింది సీతమ్మ.

పోస్ట్‌మాన్ చేతిలో ఎయిర్ మెయిల్ లెటరు.

ప్రాణం లేచొచ్చినట్టయింది ఆమెకి.

గత వారం రోజులుగా ఈ ఉత్తరం కోసమే ఎదురు చూస్తోందామె.

“సింగపూర్ నుంచమ్మా” అన్నాడు పోస్ట్‌మాన్.

“మరే” అంటూ ఉత్సాహంగా అందుకొంది సీతమ్మ.

లోపలికెళ్ళి కవరు చించింది.

“అమ్మా ...”

విజ్జికి సంబంధం చూస్తున్నామని వ్రాశారు. బహుశః అది కుదరొచ్చనీ వ్రాశారు ఆ సంబంధం ఏమైందో తెలుసుకోవాలని చాల ఆత్రంగా వుంది నాకు.

విజ్జి ఉత్త అమాయకురాలు. వయసొచ్చినా ఇంకా దానికి పసితనం వదల్లేదు. దాన్నిచ్చే దగ్గర ఒకటికి పదిసార్లు ఆలోచించవలసిన అవసరం వుంది. కాస్త కలిగిన వాళ్ళకీ, మంచి వాళ్ళకీ ఇస్తే మన బాధ్యత తీరుతుంది. అదీ సుఖపడుతుంది. దాని సుఖంకంటే మనకు కావలసిందేముంది? కొద్ది నెలల్లో నేనెలాగూ వస్తాను, ఈలోగా పెళ్ళికి మీరు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేయగలరు. డబ్బు విషయంలో ఏమీ సంకోచించవద్దు”.

అదీ సారాంశం.

కొడుకు ప్రసాద్ వ్రాసిన ఆ ఉత్తరాన్ని మళ్ళీ మళ్ళీ చదివింది సీతమ్మ. తామందరినీ వదలి...ఈ దేశాన్నే వదలి . ఎక్కడో సముద్రాల కావల తమ కోసమే ఆలోచిస్తూ...తమకోసమే కలవరిస్తోన్న తన ముద్దుల బిడ్డడి హృదయ సౌందర్యాన్ని ఆ అక్షరాల చాటున చూస్తో మళ్ళీ మళ్ళీ సీతమ్మ ఆ ఉత్తరాన్ని చదివింది.

పిచ్చితండ్రి...ఇప్పుడెలా వున్నాడో...ఏం చేస్తున్నాడో...దాదాపుగా రెండేళ్ళు కావొస్తోంది

వాడిని చూచి. ఇక్కడ షిప్‌యార్డ్‌లో ఫిట్టర్‌గా ఉద్యోగం చేస్తుండేవాడు. అనుకోకుండా సింగపూర్ షిప్‌యార్డ్‌కి వేళ్ళే అవకాశం వచ్చింది. అంతే, అన్నీ లెక్కలు గట్టాడు. రెండేళ్ళ కాలంలో ఎంతలేదన్నా నలభై యాభై వేలు మిగిలించవచ్చు చెల్లెలు పెళ్ళి చేయడానికి, ఇంటి మీదవున్న అప్పు తీర్చడానికి, తమ్ముడిని ఆఖరు చెల్లినీ కాలేజీలో చదివించడానికి, ఇంత కంటే మంచి అవకాశం రాదు. ఇది అనుకోని అదృష్టం !

తనతో ఆ మాటే అన్నాడు.

కానీ...

తిరిగొచ్చాక, వాడికి తిరిగి ఇక్కడ ఉద్యోగం వుండదు. మళ్ళీ ఎక్కడో దేవులాడాలి. పెద్ద చెల్లెలు పెళ్ళీ, తమ్ముడూ ఆఖరు చెల్లెలి చదువులూ గట్టెక్కినా, వాడి జీవితం తిరిగి కష్టాల పాలవుతుంది. తనవాళ్ళ జీవితాల్లో వెలుగు నింపడంకోసం తన జీవితం క్రొవ్వొత్తి చందంగా మారుతుంది.

అందుకే... ''నువ్వు సాహసం చేస్తున్నావయ్యా. ఏదెలా జరగాలో అలాగే జరుగుతుంది. వాళ్ళకోసమని, నీ జీవితాన్ని త్యాగం చేయొద్దు'' అంది తను.

''అంతమాటెందుకమ్మా. ఇది బాధ్యతే తప్ప త్యాగం కాదు. నువ్వొప్పుకుంటే నేను మిగతా ఏర్పాట్లు చూస్తాను'' అన్నాడు.

ఇంటి యజమాని తమ నర్థాంతరంగా వదిలేసి కాలంచేశాక, కంపెనీవాళ్ళు ఆయన వారసుడిగా, ఇంటికి పెద్దనాడయిన ప్రసాద్‌కి ఉద్యోగం ఇచ్చారు. సంసార భారాన్ని తన లేత భుజాలమీదకి ఎత్తుకోవలసి వచ్చింది ప్రసాద్‌కి.

వాడి ఆలోచనంతా చెల్లెలి పెళ్ళి చేయాలని.

పెద్ద చెల్లెలంటే వాడి కమితమైన ప్రేమ. దాన్ని ఎక్కడో అందలం ఎక్కించాలని వాడి తాపత్రయం.

ఈ వరకట్నాల బజారులో, వరుళ్ళ వేలం పాటలో ఏ రాజకుమారుడినో తన చెల్లెలుకోసం కొనాలనీ, అందుకు తన శ్రమనీ, శక్తినీ ధార పోయడానికి సిద్ధపడి... ఈ పుట్టి పెరిగిన వూరునీ, నేలనీ వదలి, సముద్రాలుదాటి అక్కడ రేయింబవళ్ళు కార్ఖానాలో కష్టపడుతున్నాడు.

కొడుకు పడుతున్న అవస్థలు తలపుకు రాగానే సీతమ్మ కళ్ళు తడిబారాయి. హృదయం భారమైంది.

క్రమేణా ఆమె ఆలోచనలు, విజ్జికిచూసిన సంబంధంవైపుకి మళ్ళాయి.

విజ్జికి చూసిన ఆరో సంబంధం ఇది.

అన్ని సంబంధాలలోకీ, అన్ని విధాలుగా మెరుగ్గా అన్పించింది ఇదే !

ఈ సంబంధాన్ని ఖాయం చేసుకున్న ఆ రోజు కళ్ళముందు కదులాడింది.

* * *

పెళ్ళికొడుకు పోర్టులో ట్రేడ్స్‌మన్. ఇద్దరు తమ్ముళ్ళూ, ఇద్దరు చెల్లెళ్ళూ వున్నారు. అందరూ చదువుకుంటున్న వాళ్ళే. తండ్రికి కూడ పోర్టులోనే ఉద్యోగం. సొంత ఇల్లు వుంది. పెళ్ళికొడుకూ, తండ్రీ, తల్లీ, పెళ్ళిపెద్దా, మరొకరెవరో వచ్చారు.

పెళ్ళిచూపుల తతంగం అయింది.

పిల్లా పిల్లాడూ ఈడూ జోడుగా వున్నారు.

పరస్పరం సంబంధం నచ్చింది.

ఇక 'వేలంపాట' మొదలయింది.

''వీళ్ళ స్థితిగతు లేమిటో మీకు ముందే మనవి చేసుకున్నా గదా! అన్నీ తెలిసినవారు. పెద్దవారు. కష్టసుఖాలెరిగినవారు. కట్నం సంగతి మీరే ఇంతని చెప్పండి'' అన్నాడు పెళ్ళిపెద్ద.

పెళ్ళికొడుకు తండ్రి మీసం సవరించుకున్నాడు.

పెళ్ళికొడుకు తల్లి బింకంగా చూస్తోంది.

పెళ్ళికొడుకు తలొంచుకున్నాడు.

సీతమ్మ గుండెలదురుతున్నాయి.

ఆయన నోటి నుంచి ఏమాట వినవలసి వస్తుందో ...

ఆయన నోరు పెగిలింది : ''ప్రత్యేకం చెప్పేదేముంది ? ఈ మధ్యే ఓ సంబంధం వచ్చింది. అన్ని రకాలుగా బాగానే వుంది. ముప్ఫై వేలిస్తామన్నారు.'' బాంబు ప్రేలనే ప్రేలింది.

''ఆడపడుచులకు ఒక్కొక్కళ్ళకీ వేయి నూటపదహార్లు, పెళ్ళికొడుక్కి వాచీ, ఉంగరం, ర్యాలీ సైకిలు, సూటుకో వెయ్యినూటపదార్లు, డబల్ కాటూ పరుపూ వగైరా లాంఛనాలు ఎలాగూ వుంటాయనుకోండి'' పెళ్ళికొడుకును కన్న మాతృమూర్తి మాటలవి.

''మేం నలభై అడిగాం. పోనీ ముప్ఫైయయిదు ఇవ్వామన్నాం. వాళ్ళు తూగలేమన్నారు'' అందుకే అది తప్పిపోయిందని తేల్చాడు తండ్రి.

పెళ్ళిపెద్ద, 'మహా అయితే ఏ పాతిక వరకో వుండొచ్చు' అన్నాడు అంతకు ముందు సీతమ్మతో.

ఇప్పుడీ మాటలు వింటున్న సీతమ్మకి కళ్ళు బైర్లు కమ్ముతున్నట్టయింది.

పెళ్ళిపెద్ద తన అంచనా ఘోరంగా తప్పినందుకు కాబోలు... ఆయన మొఖం మ్లానమయింది.

ఇంటాయన బ్రతికున్న రోజుల్లో ఈయనా ఆయనా స్నేహితులు. ఆ అనుబంధాన్ని పురస్కరించుకొని ఈ తతంగానికి పెళ్ళిపెద్దగా ఆయన కార్యభారాన్ని మోయడానికి సిద్ధపడ్డాడు.

ముందుగా ఆయనే తెప్పరిల్లుకొని, ''తమరలా అంటే మేమేం మాట్లాడగలం. ఒక్కసారి ఆ సీతమ్మ తల్లి మొఖం చూడండి. చిన్నవాడైనా, చెల్లెలి పెళ్ళి చేయాలన్న ఆరాటంతో అష్టకష్టాలు పడుతున్న ఆ అబ్బాయి గురించి ఒక్కసారి ఆలోచించండి.

ఈ ఇంటి సాంప్రదాయం... మంచితనం ...దృష్టిలో వుంచుకోండి. మీరూ ఆడపిల్లలున్న తల్లిదండ్రులే గదా ! ... మరొక్కసారి ... '' కంటనీరు పెట్టలేదు, కాళ్ళు పట్టలేదు తప్ప... మనసుంటే కరిగేలా... రాళ్ళైనా కరిగేలా ... ప్రాధేయపడ్డాడాయన.

అవతలి వాళ్ళలో ఏ పాప చింతన మెదిలిందో, ఏ హృదయ స్పందన కలిగిందో ... పాతికవేలకి దిగారు. లాంఛనాలలోనూ కొద్దిగా మినహాయింపు.

ఆ మాత్రానికే సంతోష మన్పించింది సీతమ్మకి.

పెళ్ళి పెద్ద తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు.

సంబంధం సెటిలయింది.

* * *

తన 'బాండు' కాలం పూర్తయి పెళ్ళి నాటికి ప్రసాద్ కూడ వచ్చాడు.

సంబంధం సంగతులు స్వయంగా తెలుసుకొని తృప్తిపడ్డాడు.

తన కోరిక నెరవేరినందుకు ఆనందమయ్యింది.

ప్రసాద్ హుషారూ, చెల్లెలంటే అతను చూపే ఆప్యాయతా, అనురాగం అన్నీ చూశాక మగ పెళ్లి వారికి సరికొత్త కోర్కెలు పుట్టుకొచ్చాయి.

పెళ్లి 'కళ్యాణ మండపం'లో జరిపిస్తే బావుంటుందన్నారు. మంచి బ్యాండు మేళం వుంటే బావుంటుందన్నారు. రెండు మూడు రీళ్ళు కలర్ ఫోటోలు లాగితే బావుంటుందన్నారు. వచ్చే బంధు మిత్రులకి టేబిల్ మీల్స్ అరేంజ్ చేస్తే బావుంటుందన్నారు.

ఉప్మాలో జీడిపప్పులు, లడ్డాల్లో కిస్‌మిస్‌లూ ఎక్కువేస్తే బావుంటుందన్నారు. అది కోరికల సముద్రం. దాని కంతూ దరీలేదు.

ప్రసాద్ కొక్కటే ఆలోచన. అది తన చెల్లి పెళ్లి.

తానేంచేస్తున్నా అది చెల్లి పెళ్లి గురించే చేస్తున్నాడు.

ఇదంతా ఆమె ఆనందం కోసం... ఇదంతా ఆమె సౌభాగ్యం కోసం ... తన చిన్నారి చెల్లెలు పచ్చగా పదికాలాలపాటు వర్ధిల్లాలి. అంతే.అంతే.


అంతటా తానే అయి, ఎక్కడా ఏ లోపం జరగకుండా తన శక్తినీ, తాహతునీ గూడా ఆలోచించనుండా చెల్లెలు పెళ్లి ఘనంగా పూర్తిచేశాడు ప్రసాద్.

అతను పడుతున్న తాపత్రయానికి, అతను చేస్తోన్న త్యాగానికి ఆ తతంగం అయ్యేదాకా సీతమ్మ కళ్ళు చెమరుస్తూనే వున్నాయి.

* * *

కాలం మరికొంత ముందుకెళ్ళింది.

ప్రసాద్ ఇప్పుడో ప్రవేటు ఫర్మ్‌లో సూపర్‌వైజర్‌గా వుంటున్నాడు




# వలయం

అతని తమ్ముడూ, ఆఖరి చెల్లెలూ కాలేజీల్లో చేరారు.

జీవితనౌక ఒడిదుడుకులకి తట్టుకొని, ఇప్పుడు సాఫీగా ప్రయాణం సాగిస్తోంది.

ప్రసాద్‌కి వివాహం చేయాలన్న తలంపు కలిగింది సీతమ్మకి.

సహృదయుడూ, బుద్ధిమంతుడూ, గుణవంతుడూ అయిన తన కొడుకు చేయందుకునే ఆ అదృష్టవంతురాలెవరో ... ఎంత అదృష్టం చేసుకు పుట్టిందో ఆ అమ్మాయి ...

తాను మరీ ఆశపోతేం కాదు.

కట్నం ఏ ముప్పై వేలో అయినా ఒప్పుకుంటుంది. ఉత్త ట్రేడ్స్‌మన్ అయిన అల్లుడికే దాదాపు నలభై వేలకు పైగా ఖర్చు పెట్టారు తాము. సూపర్‌వైజర్ అయిన తన కొడుక్కి ముప్పై వేలంటే అది చాల తక్కువన్న మాటే కదూ !

ఆ ముప్పై వేలతో ఆఖరుదాని పెళ్ళి చేయాలి !

దాంతో ఈ ఇంటి సమస్య తీరినట్టే.

ఈ బ్రతుకు ధన్యమైనట్టే !

సీతమ్మ ఆలోచనలు ఆ విధంగా సాగుతున్నాయి.

ఓ మామూలు 'అమ్మ'గా ఆమె రాత్రింబవళ్ళు తన కొడుకు పెళ్ళి గురించే వూహిస్తోంది ... ఆలోచిస్తోంది.

ఆమె వూహలు... ఆలోచనలు...ప్రసాద్‌కి అర్థమవుతున్నాయి. కానీ అతని మనసులో ఏముందో ఓ పట్టాన సీతమ్మకే తెలీడంలేదు.

ఓ శుభదినాన ...

తన కళ్ళెదురుగా కన్పించిన దృశ్యానికి స్థాణువై నిలబడపోయింది సీతమ్మ.

ఆమె కెదురుగా ప్రసాదూ, అతని చిటికెన వ్రేలు పట్టుకొని ఓ అమ్మాయీ ... ఇద్దరి మెడలలో పూలదండలు ...

జరిగిందేమిటో తెలియడానికి అరక్షణం పట్టలేదు.

కానీ ... తెలిసిందాన్ని అర్థం చేసుకోవడానికే ఆమె మనసు గందరగోళమవుతూంది.

ఇది నిజమా !

తన కొడుకు ప్రసాద్...తనతో ఒక్క మాటైనా చెప్పకుండా...ఇలా ఎవరినో పెళ్ళి చేసుకొని...ఏమిటిదంతా...

వైవిధ్యంగల వ్యాసాలకు

**భారతి మాసపత్రిక**

చదవండి!

''అమ్మా...'' అన్నాడు ప్రసాద్.

ఇహలోకంలో కొచ్చింది.

''క్షమించమ్మా! నీకు తెలియకుండా ఇలా పెళ్ళి చేసుకున్నందుకు మన్నించు. నీకు ముందే చెబితే, ఎందుకో ఈ పెళ్ళి జరగదనిపించింది. ఎంతైనా నువ్వు 'అమ్మ'వి. మామూలు 'అమ్మ'వి! నీ కొడుకు పెళ్ళి నలుగురిలో వైభవంగా జరగాలని, కట్నాలూ కానుకలూ దండిగా రావాలని ... నువ్వూ కోరతావు... ఆశిస్తావు. నీ కోర్కెలూ...ఆశలూ...కొంతలో కొంత ఎరిగిన వాడిని కావడం వల్ల...నా అభిప్రాయం...ఆలోచన ముందుగా నీకు చెబితే అనవసరమైన వాగ్వివాదం అవుతుందని...నీ మనసు నొప్పించిన వాడినవుతానని అన్పించింది. అది జరగబోయే పనికి ఆటంకమవుతుందని తోచింది.

అమ్మా! ఓ ఆడపిల్ల పెళ్ళి చేయడానికి మనం ఎన్ని అవస్థలు పడ్డామో, మ్రింగలేక కక్కలేక ఎంత నరకయాతన అనుభవించామో, ఈ జీవితానికిక చాలన్నట్టుగా ఎంత బాధని మూటగట్టుకున్నామో నువ్వెరుగుదువు గదా! సాధారణంగా అన్ని ఇళ్ళలోనూ అందరి ఆడపిల్లల తల్లిదండ్రులకిది అనుభవైకవేద్యమే అయినా, తిరిగి తమ మగపిల్లల పెళ్ళి దగ్గరకొచ్చేసరికి అవన్నీ మర్చిపోతారు. తిరిగి మాయలో పడతారు. తిరిగి కట్నాలూ కానుకలూ కోరతారు. తిరిగి చరిత్ర పునరావృతం అవుతుంది. ఇదో వలయం. దీన్ని ఎక్కడో అక్కడ ఛేదించాలి...భేదించాలి... ఈ చరిత్ర మన ఇంట్లో పునరావృతం కాకూడదని నేనీ పని చేశాను. ఆదర్శవంతమైన పెళ్ళి...ఏ కట్న కానుకలూ ఆశించకుండా... ఏ పెళ్ళి దుబారాలు కోరకుండా ..చేసుకున్నాను. తప్పు చేశానా అమ్మా?''...

కొడుకు వంకే తదేకంగా చూస్తుండిపోయింది సీతమ్మ.

కళ్ళ ఎదుట కొడుకు మహోన్నతంగా, తానందుకోలేనంత ఎత్తుకెదిగి కన్పిస్తున్నాడు.

ఆమె హృదయం వెన్నలా కరుగుతోంది.

ఆమె కళ్ళంట కన్నీరు ధారలుగా కారుతోంది.

''అమ్మా!—నేనిలా చేశానని బాధ పడుతున్నావు గదూ.. ''

''లేదురా... ఇది బాధకాదు... ఆనందం!.. నీలాంటి బిడ్డను కన్నందుకు ఆనందిస్తున్నాను. గర్విస్తున్నాను. చెప్పేవాళ్ళేగాని చేసేవాళ్ళు లేని ఈ లోకంలో నీలాంటి బిడ్డను కన్నందుకు గర్విస్తున్నానయ్యా !''

మనసు లోతుల్లోంచి మాటలు పొంగి వచ్చాయి.

ఆ వధూవరులిద్దరూ తల్లి కాళ్ళకు నమస్కరించారు.

ఆమె ఆనందభాష్పాలే వాళ్ళకు అక్షింతలయ్యాయి. ★